క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేమూరు: మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగనుందని ఆ శాఖ ఏఈ గోపీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమూరు గ్రామంలో విద్యుత్ ఫీడరు పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ ఆలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగపిల్లలకు శ్రీఘ్రంగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

నేడు సంగుపాలెంలో సురక్ష వైద్య శిబిరం

పిట్టలవానిపాలెం: సంగుపాలెం గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ కార్యదర్శి సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ సచివాలయం వద్ద ప్రత్యేక వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

కథలు, చిత్రలేఖనం పుస్తకాల పంపిణీ



చెరుకుపల్లి: విద్యార్థుల్లో చిన్నతనం నుంచే నైతిక విలువలు, కళలపై ఆసక్తి పెంపొందించేందుకు కథలు, చిత్ర లేఖనం పుస్తకాలు దోహదపడతాయని హెచ్‌ఎం అక్కల బాలాజీ అన్నారు. కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో 31 మంది విద్యార్థులకు పాఠశాల విద్యా కమిటీ సభ్యులు ఉచితంగా కథలు, డ్రాయింగ్ పుస్తకాలు, స్కెచ్ పెన్నులు, పెన్సిళ్లు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గాజుల వెంకటేశ్వరమ్మ, కమిటీ సభ్యులు జన్ను నక్షత్ర, ఉమా సుందరి, భట్టు వెంకటేశ్వరమ్మ, బాలాత్రిపుర సుందరి పాల్గొన్నారు.

మహిళా చైతన్య దీప్తి వరలక్ష్మమ్మ

బాపట్ల అర్బన్ : తన రచనల ద్వారా మహిళలను జాగృతం చేసిన గొప్ప రచయిత్రి కనుపర్తి వరలక్ష్మమ్మ అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు అన్నారు. కనుపర్తి వరలక్ష్మమ్మ జయంతి సందర్భంగా శుక్రవారం ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫోరం సభ్యులు మాట్లాడుతూ తెలుగు సాహితీ చరిత్రలో లేఖా సాహిత్యానికి శ్రీకారం చుట్టిన కవయిత్రి కనుపర్తి వరలక్ష్మమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చేబ్రోలు సతీష్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి



వెల్లటూరు(భట్టిప్రోలు): రైతులు రసాయన ఎరువులు వాడకుండా.. కషాయాలు తయారు చేసుకుని పంట సాగులో వాడితే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యసాయ నిపుణులు పేర్కొన్నారు. వెల్లటూరు రాధాకృష్ణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వరిలో సుడిదోమకు తూటికాడ కషాయం, ఆకు ముడత పురుగు నివారణకు వెల్లుల్లి, పచ్చిమిర్చి కషాయం తయారు చేసే విధానాన్ని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌టీ-1 శివనాగేశ్వరమ్మ, నిర్వాహకులు రేవతి, శ్రీనివాసరావు, రామయ్య, ఇస్మాయిల్, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

బైక్ అపహరణ

తెనాలి రూరల్: బైక్ అపహరణపై కేసు నమోదైంది. పట్టణ శాలిపేటకు చెందిన కొత్త రమేష్ ఈ నెల 1వ తేదీ రాత్రి బైక్‌ను ఇంటి ముందు నిలిపారు. మర్నాడు ఉదయం నిద్రలేచి చూడగా వాహనం కనబడలేదు. ఇన్నాళ్లు గాలించినా ఫలితం లేకపోవడంతో వన్‌టౌన్ పోలీసుల్ని శుక్రవారం ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలందరికీ ఆరోగ్య రక్ష..!

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన

కర్లపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజలందరికీ ఆరోగ్య రక్ష కలుగుతుందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. నల్లమోతువారిపాలెంలో గురువారం జరిగిన జగనన్న సురక్ష ఆరోగ్య వైద్య శిబిరంలో ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైద్య శిబిరాన్ని పరిశీలించారు. పరీక్షలు చేయించుకున్న వారికి జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యశాలల్లో ఉచితంగా వైద్యం చేయిస్తుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు డి.రమ్య, ఎస్.రమేష్, ఎం.శ్రీమౌనిక, వై.రమ్య 350మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. గ్రామ సర్పంచ్ మాడా సుబ్రమణ్యం, ఎంపీటీసీ సభ్యులు టీవీ సాంబశివరావు, ఆసిఫ్ అలీ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ ఉచిత వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

పిట్టలవానిపాలెం: ప్రజలందరికీ ఉచిత వైద్యమే ప్రభుత్వ లక్ష్యమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. భవనంవారి పాలెం గ్రామ సచివాలయం ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ యాచనప్ప, జనరల్ ఫిజీషియన్‌లు డాక్టర్ లీలా క్రాంత్ కర్నల్, డాక్టర్ మురళీ, డాక్టర్ లోకేష్, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ మాణిక్యం, గైనకాలజిస్టు డాక్టర్ రాజేశ్వరీ పాల్గొని మొత్తం 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు యేత్ర అశ్వినిరెడ్డి, సర్పంచ్ మోదుగుల శివనాగేశ్వరి, ఎంపీటీసీ డి.సింధు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ బాజీ, వైస్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేమూరులో..

వేమూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరంలా మారిందని వైద్యుడు వెంకట సురేష్ అన్నారు. వేమూరు గ్రామ సచివాలయం -2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. 341 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టరు రవళీ, కోటేశ్వరి, సంతోష రాయల్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

277 మందికి వైద్య పరీక్షలు

రేపల్లె రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వుక్రవారం చాట్రగడ్డలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. శిబిరంలో విశ్వేశ్వరం, మోళ్లగుంట పీహెచ్‌సీల వైద్య సిబ్బంది 277 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివపార్వతీ, ఎంపీటీసీ మేడికొండ సుధాకర చంద్రహాసరావు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పెనుమూడిలో శనివారం మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శివపార్వతీ ఒక ప్రకటనలో తెలిపారు.



వేమూరులో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు



భవనంవారిపలెంలో వైద్యపరీక్షలు చేస్తున్న ప్రత్యేక వైద్యనిపుణురాలు



కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి



చాట్రగడ్డ వైద్య శిబిరంలో రోగులకు మందులు పంపిణీ



మంత్రిపాలెంలో ఈసీజీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐలవరంలో 450 మందికి వైద్య పరీక్షలు..

ఐలవరం(భట్టిప్రోలు): మండలంలోని ఐలవరం సచివాలయం-1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. వైద్యులు సీహెచ్ రామలక్ష్మి, కిన్నెర, సాయి, శ్రీనివాసరావు, శశికాంత్, కంటి వైద్య నిపుణురాలు అరుణరాణి (పీఎంవోఏ)లు వైద్య సేవలందించారు. 450 మందికి మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, ఎంపీటీసీ సభ్యుడు మురుగుడు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కర్రా జయశ్రీ, తహసీల్దారు డి. వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ టి. ఊహారాణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు

నగరం: గ్రామీణ ప్రాంతాలల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్ అన్నారు. మంత్రిపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంపీడీవో పర్యవేక్షించారు. శిబిరంలో 494 మందికి వైద్య పరీక్షలు జరిపినట్లు డాక్టర్ భవానీశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తులసిరాజేశ్వరి, సీహెచ్‌వో బాబురావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి వైద్య సేవలు

బాపట్ల: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఇంటికి వైద్య సేవలు అందుతున్నాయని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మండలంలోని కంకటపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, ఎంపీడీఓ రాధాకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, గవిని కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండంలోని నడింపల్లి సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. ముందుగా గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నాయకులతో కలసి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఏదైన సాంకేతిక లోపంతో పథకాలకు దూరమైతే అలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జగనన్న అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి పథకాన్ని మహిళల పేరుతో అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి, ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, జెడ్పీటీసీ మరివాడ వెంకట పావని, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండలు రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్ను కోటేశ్వరరావు, స్థానిక సర్పంచ్ ఏమినేని సుబ్బారావు, ఎంపీటీసీ కొడాలి నాగరాణి, ఉప సర్పంచ్ రోశయ్య, తహసీల్దారు కె.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రొయ్యలకు రోజుకు ఆరుసార్లు మేత వేయాలి

ఆముదాలపల్లిలో వైఎస్సార్ మత్స్య సాగుబడి



రైతులకు పలు సూచనలిస్తున్న వీఎఫ్ఏ శ్రీనివాసరావు

నిజాంపట్నం: ఆక్వా సాగులో జాగ్రత్తలు పాటించాలని విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ శ్రీనివాసరావు అన్నారు. ఆముదాలపల్లిలో వైఎస్సార్ మత్స్య సాగుబడి కార్యక్రమాన్ని రైతులు బెల్లంకొండ శ్రీనివాసరావు, కోసూరి సుబ్బారావు చెరువుల వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎఫ్ఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆక్వా చెరువుల కాంపౌండ్ చుట్టూ కచ్చితంగా ఫెన్సింగ్ ఉండాలన్నారు. బయో సెక్యూరిటీ మెయింటేనెన్స్ చేయాలని సూచించారు. రోజుకు ఆరు సార్లు మేత వేయడం వల్ల రొయ్య మెటబాలిజం పెరిగి పోషకాలు బాగా అందుతాయని తెలిపారు. దీనిద్వారా తక్కువ రోజుల్లో అధిక కౌంట్ తీయవచ్చన్నారు. ఆక్వా రైతులు తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందాలని స్పష్టం చేశారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

రసాయన రహిత కూరగాయలతో ఆరోగ్యం

తూములూరు (కొల్లిపర): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ప్రతి మహిళ తన ఇంటి ఖాళీ స్థలంలో సూర్య మండలి మోడల్ పద్ధతిలో రసాయన రహిత ఆకుకూరలు, కూరగాయలు పండించాలని హెల్త్ అండ్ న్యూట్రిషన్ నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ ఎం. నాగలక్ష్మి తెలిపారు. మండలంలోని తూములూరులో మహిళలకు శుక్రవారం ప్రకృతి వ్యవసాయంలో ఆరోగ్య పోషణ కార్యక్రమంలో భాగంగా మహిళలు ఇంటి పెరటిలో రసాయన రహిత కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన కూరగాయలు తినడం ద్వారా పోషకాలు మెండుగా లభించి, కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మిగిలిన కూరగాయల్ని గ్రామంలో అమ్ముకోవడం వల్ల ఆర్థికంగా ఎదుగుదల కూడా ఉంటుందని తెలిపారు. అనంతరం సూర్య మండలం తయారీ, విత్తనాలు నాటుకునే విధానం తదితర అంశాల్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీ దూసరి రాజకుమారి, డ్వాక్రా సంఘం సభ్యులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



తెనాలి రూరల్: తెనాలిలోని ది హోల్‌సేల్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా చుండూరి నాగమల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడిగా దేవతి తులసీ ఉమామహేశ్వరరావు, కార్యదర్శిగా దేసు యుగంధర్, సంయుక్త కార్యదర్శిగా పచ్చిపులుసు రామ్మోహనరావు, కార్యవర్గ సభ్యులుగా చుండూరి సత్యనారాయణ, ఇడపలపాటి హరిప్రసాద్, గోళ్ల కాశీవిశ్వనాథం, యున్నమూరి వెంకటేశ్వర్లు, కనికచర్ల శ్రీతల్ప సాయి మణికంఠ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యుల్ని పలువురు వ్యాపారులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

చిన్న పిల్లలకు ధ్యానంలో ఉచిత శిక్షణ

తెనాలి టౌన్: దసరా పండుగ సందర్భంగా శ్రీ ఆంజనేయం ధ్యానయోగ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 15నుంచి 21 వరకు చిన్న పిల్లలకు ధ్యాన్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు చిల్డ్రన్స్ యోగా కన్వీనర్ కూరపాటి నాగరాజు శుక్రవారం తెలిపారు. గంగానమ్మపేటలోని చుండూరువారి సత్రం ప్రాంగణంలో ప్రతిరోజు ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు ధ్యానంలో శిక్షణ ఉంటుందన్నారు. ఐదు సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలు వయస్సు గల పిల్లలకు వారి తల్లిదండ్రులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. యోగ మండలి వ్యవస్థాపకులు కిశోర్ గురూజీ శిక్షణ ఇస్తారని తెలిపారు. వివరాలకు 9440712208లో సంప్రదించాలని కోరారు.

సమస్యలను పరిష్కరించే గొప్ప ఆయుధం చిరునవ్వు



మాట్లాడుతున్న డాక్టర్ రవికుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: ఒత్తిడితో జీవితంలో ఎదురయ్యే సమస్యల్ని పరిష్కరించే గొప్ప ఆయుధం చిరునవ్వు అని ప్రముఖ వైద్యుడు డాక్టర్ వి.వి. రవికుమార్ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'నవ్వండి -సంతోషంగా ఉండండి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ యాంత్రిక జీవితంలో మనస్సుకు, శరీరానికి మంచి ఔషధం నవ్వు మాత్రమేనని పేర్కొన్నారు. సినీ దర్శకుడు జంధ్యాల చెప్పినట్టు నవ్వడం ఒక యోగం, నవ్వించడం ఒక భోగం, నవ్వలేకపోవడం ఒక రోగంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, గుంటూరు జిల్లా జాతీయ సేవా పథక కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, ఆర్. జయ శైలజ, సురేష్, స్వామి, కుమార్ రాజా, కె. శ్రావణి,విద్యార్థులు పాల్గొన్నారు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో...

లక్ష్మీపురం: హాస్యం ఆప్తమిత్రుని వంటిదని మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి రామ్‌కుమార్ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రపంచ నవ్వుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. హాస్యం గొప్ప ఔషధంతో పాటు ఆరోగ్యదాయిని, ఆనందదాయినిగా పేర్కొన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, హాస్య రచయిత బి.వి.రామ్‌కుమార్ మాట్లాడుతూ నవ్వు నాలుగు విధాలా చేటు అనేది పాత మాటనీ, నవ్వు నాలుగు విధాల గ్రేటు నేటి మాటని తెలిపారు.

నాయకుల దిగజారుడు వ్యాఖ్యలు తగదు

ఇటీవల కొందరు నాయకుల వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలు శృతి మించి పోతున్నాయని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఖండించారు. అసభ్యకర విమర్శలు, తిట్ల పురాణాలు సభ్య సమాజం సిగ్గుతో తల దించుకునేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి

ఎమ్మెల్యే కోన రఘుపతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయేందుకు గృహసారథులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు కృషి చేయాలని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కోన రఘుపతి మాట్లాడుతూ నియోజకవర్గంలో గడిచిన నాలుగున్నరేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని తెలిపారు. బాపట్లకే తలమానికంగా మెడికల్ కళాశాల వచ్చిందని గుర్తుచేశారు. మరోవైపు నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ, నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అధికారంలోకి ఎందుకు తెచ్చుకోవాలో ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు కె.రాఘవరెడ్డి, నాయకులు షేక్.సయ్యద్ పీర్, గవిని కృష్ణమూర్తి, గొర్రుముచ్చు పుష్పరాజ్యం, చింతల రాజశేఖర్, గేరా మణిభూషన్, పి.శేఖర్, మోర్ల సముద్రాల గౌడ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి



తెనాలి రూరల్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న గుర్తు తెలియని మహిళ ఈ నెల 2న తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌లోని విజయవాడ్ బుకింగ్ కౌంటర్ వద్ద అపస్మారక స్థితిలో ఉండడాన్ని ప్రయాణికులు గమనించారు. 108 అంబులెన్సుకు సమాచారమిచ్చి తెనాలి జిల్లా వైద్యశాలకు పంపారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు గుంటూరు పంపగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు జిల్లా వాలీబాల్ జట్టుకు సూరేపల్లి విద్యార్థిని



సూరేపల్లి(భట్టిప్రోలు): వేజండ్ల హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వాలీబాల్ పోటీలలో సూరేపల్లి వీపీ అండ్ జీఎస్‌ఎం హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న సీహెచ్ మాధవి ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైంది. శనివారం నుంచి కడపలో నిర్వహించనున్న అండర్-17 వాలీబాల్ పోటీలలో పాల్గొననున్నట్లు ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాసశర్మ తెలిపారు. శిక్షణ ఇచ్చిన పీఈటీ జీవీఎస్ నాగేశ్వరరావు, ప్రతిభ చూపిన మాధవిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

యూత్ రెడ్‌క్రాస్‌తో సేవా కార్యక్రమాలు



బాపట్ల: కళాశాలల్లో యూత్ రెడ్‌క్రాస్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని బాపట్ల జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బి.ఎస్.నారాయభట్టు పేర్కొన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన యూత్ రెడ్‌క్రాస్ నిర్వహించారు. యువతలో సేవా భావం పెపొందించేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ సరిత, యూత్ రెడ్ క్రాస్ కో-ఆర్డినేటర్ సుధారాణి పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల సేవ



తెనాలి అర్బన్: బోసు రోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కొండపి వసుంధర ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సత్యనారాయణస్వామి ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. మహిళలు సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో అందె రాజేశ్వరి, కనకదుర్గ, సీహెచ్.నాగమల్లేశ్వరి, రత్నకుమారి, చిరంజీవి, నరసింహ, కొండపి శ్రీనివాసరావు, అందె బాలచంద్రమౌళి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమరావతి రోడ్డులో ర్యాలీ

బీసీ కులగణన చేసిన బిహార్ నేతలకు పాలాభిషేకం



అమరావతిరోడ్డులో బీసీ సంఘాల ర్యాలీ

గుంటూరు రూరల్: విజయవంతంగా బీసీల కులగణన పూర్తి చేసిన బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ చిత్రపటాలకు బీపీ మండల్ కమిటీ నేతలు శుక్రవారం పాలాభిషేకం చేశారు. అమరావతిరోడ్డులోని ఇన్నర్ రింగ్‌రోడ్డులోగల బీపీ మండల్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మద్దతు ర్యాలీలో బీపీ మండల్ విగ్రహ కమిటీ సభ్యుడు డాక్టర్ ఆలా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీ గణన జరిగితీరాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 50 శాతానికిపైగా ఉన్న బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ అవకాశాలు కల్పించకుండా రాజకీయ పార్టీలు అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోదీకి బీసీ కుల గణన చేపట్టాలని విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. డాక్టర్ శేషయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీసీ కులగణన చేపట్టి బీసీలకు తగిన న్యాయం చేయాలని కోరారు. బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు పూర్ణయ్య, టి.నరసింహారావు, బి.సాంబశివరావు, టి కేశవ, డాక్టర్ శివకుమార్, ఓర్సు ప్రేమ్‌రాజ్, వాసు పాల్గొన్నారు.

యువజనోత్సవ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి యువజనోత్సవ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి తెలిపారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో భాగంగా జానపద నృత్యం-వ్యక్తిగత పోటీలో విద్యార్థిని కె. నాగమల్లేశ్వరి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. పోస్టర్ మేకింగ్, బృందగానం, సోలో గీతాలాపన విభాగాల్లో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానాలు దక్కినట్లు తెలిపారు. కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మల్లీశ్వరిని ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.